క్లుప్తంగా

నవ గ్రహసహిత చండీ హోమం



మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో ఆదివారం అమావాస్య పురస్కరించుకుని లోక కళ్యాణార్థం నవ గ్రహిత చండీ హోమం నిర్వహించారు. వేదపండితులు వేదాంతం పార్థసారథి ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, నవ గ్రహ సహిత చండీ హోమం నిర్వహించారు. మువ్వల చక్రధర్ దంపతులు హోమంలో కూర్చున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర అధ్యక్షుడు బల్లెం పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



పాయకాపురం(విజయవాడరూరల్):విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా స్థిరపడాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో (గత సంవత్సరం) 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున 21 మందికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్ ప్రోత్సాహక నగదు బహుమతి అందచేశారు. నగదును కార్పొరేటర్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ చేతులు మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. ఉపాధ్యాయులు నరిసింహమూర్తి, జాన్ సునంద్, నిర్మల్, రేణుకాదేవి పాల్గొన్నారు.

బాబాకు వెండి కిరీటం వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఆదివారం దాత శ్రీనివాసరావు చిన్న బాబావారికి వెండి కిరీటం అందజేశారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు మాట్లాడుతూ బాబా మందిరంలో తాము తలపెట్టిన ప్రతి కార్యక్రమంకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. భక్తులు, దాతల మనోభావాలకు అనుగుణంగా తాము ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు బాబావారికి వెండి కిరీటం చేయ తలపెట్టటం జరిగిందన్నారు. ఇందులో భక్తులు భాగస్వాములయ్యేందుకు గానూ ఇంట్లో వాడని పాత వెండిని సైతం స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు తీర్థప్రసాదాలు బాబావారి శేషవస్త్రంతో సత్కరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల ప్రకటన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సోషల్ జస్టిస్ ఫోరం అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా యర్రాకుల తులసిరామ్ యాదవ్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోటిపల్లి అయ్యప్పలను ప్రకటించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు, సమావేశంలో కో కన్వీనర్లు పంచాది రంగారావు, పెద్దిరెడ్డి మహేష్ , నల్లజర్ల రామారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉన్నత స్థానం కల్పించాలి



విజయవాడ కల్చరల్: దివ్యాంగులకు సమాజంలో ఉన్నత స్థానం కల్పించాలని అభినేత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్ అన్నారు. అభినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద అంధ కళాకారుల సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉమాశంకర్ మాట్లాడుతూ దివ్యాంగులు చాలా సందర్భాలలో వివక్షకు గురి అవుతున్నారని తెలిపారు. కానీ వారి ప్రతిభను అడ్డుకోలేకపోతున్నట్లు గుర్తు చేశారు. కళాపోషకుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులకు హద్దులు లేవన్నారు. దివ్యాంగులు కూడా సమాజంలో భాగస్వాములేనన్నారు. సాంస్కృతిక రంగ ప్రతినిధులు, ప్రసూనా రామన్, సంగీత విద్వాంసులు కేవీ బ్రహ్మానందం, స్వాతి తదితరులు పాల్గొన్నారు. గాయని గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను, నిర్వాహకుడు ఉమాశంకర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

ఉపాధ్యాయుల కొరత.. బోధన సాగేదెలా ?

- ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఆలస్యం
- స్టూడెంట్ కిట్‌లో మాస్, పుస్తకాలు లేని వైనం



సత్యనారాయణపురంలోని ఏకేటీపీ హైస్కూల్

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ నగరంలోని మున్సిపల్ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. గత ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితంగా మున్సిపల్ పాఠశాలలల్లో విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్ మెంట్ విపరీతంగా పెరిగింది. ప్రధాన పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు పెట్టిన పరిస్థితి. విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేశారు. అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయుల సంఖ్య పెరగలేదు. దీంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. కొందరు ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడం, కొన్ని పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల ఉపాధ్యాయులు చనిపోవడం కారణంగా ఖాళీలు ఏర్పడ్డాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఆ శాఖ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంది. రెండు నెలలు పూర్తి కావస్తున్నా ఆ ప్రక్రియ ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉంది. దీంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు సబ్జెక్టు టీచర్లు లేక బోధన జరగక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పేరుతో హడావిడి చేసింది. ఈ విద్యా సంవత్సరంలో డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టే అవకాశం లేదని తేలిపోయింది. ఈ ఏడాది కూడా ఉపాధ్యాయుల వర్క్ ఎడ్జస్ట్ మెంట్ తప్పడం లేదు. సబ్జెక్టు టీచర్ల కొరత పదో తరగతి విద్యార్థులపై ప్రభావం తీవ్రంగా ఉంది.

సెంట్రల్ నియోజకవర్గంలో.....

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 14 ప్రాథమిక, 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 11,941 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 403 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్ కొరత వేధిస్తోంది.

➡ సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో 1771 మంది విద్యార్థులు ఉన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 7 సెక్షన్‌లు ఏర్పాటు చేశారు. పాఠశాలలో 70 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా 51 మంది మాత్రమే ఉన్నారు.

➡ ఎల్‌బీఎస్ నగర్ సుందరయ్య స్కూల్‌లో 784 మంది విద్యార్థులు ఉన్నారు. 20 సెక్షన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 24 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఒక ఉపాధ్యాయుడు మరణించగా , కొందరు రిటైర్ అయ్యారు. ప్రస్తుతం 4 గురు ఉపాధ్యాయులు అవసరం ఉంది.

➡ముత్యాలంపాడులోని జీఎస్ఎన్ రాజు మున్సిపల్ స్కూల్‌లో 250 మంది విద్యార్థులు ఉన్నారు. 9 మంది ఉపాధ్యాయులకు గాను 8 మంది పనిచేస్తున్నారు. భౌతిక శాస్త్రం అధ్యాపక పోస్టు ఖాళీగా ఉంది.

➡ వాంబే కాలనీ జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్‌లో 617 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 6గురు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్దుబాటు ప్రక్రియకు ప్రతిపాదనలు పంపారు.

➡ సూర్యారావుపేట కర్నాటి రామ్మోహనరావు స్కూల్ నందు 279 మంది విద్యార్థులు ఉన్నారు. 12 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది.

➡ రాజీవ్‌నగర్ రాజీవ్ గాంధీ మున్సిపల్ స్కూల్‌లో 405 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 11 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 4 ఖాళీలు ఉన్నాయి.

➡ అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్‌లో 800 మంది విద్యార్థులకు గాను 24 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

-కేర్ అండ్ షేర్ పాఠశాలలో 655 మంది విద్యార్థుల ఉన్నారు. 14 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ మరో 10 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది.

➡ కండ్రిక బీవీ సుబ్బారెడ్డి పాఠశాలల్లో 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విద్యార్థులకు అందని కిట్లు

స్టూడెంట్ కిట్లు ఆరో తరగతిలో ప్రవేశించిన వారికి అరకొరగా అందాయి. కొంత మందికి బూట్లు సరిపడా రాలేదు. కొంత మందికి టెక్స్ బుక్స్ ప్రధాన సబ్జెక్టులవి అందలేదు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు పూర్వ విద్యార్థులంతా కలిసి ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి అన్నారు. స్థానిక రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కళాశాల ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజయ సారథి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులందరూ ప్రతి ఏటా స్నేహితుల దినోత్సవం రోజున ఈ విధంగా కలుసుకుని సంతోషంగా గడపడమే కాకుండా వారంతా చదువుకున్న కళాశాలలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు మాట్లాడుతూ.. కళాశాల తరగతి గదులు, పరిపాలనా భవనం నిర్మాణం చేసి 60 ఏళ్లు పూర్తవుతుందని, వీటిని మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారులను కలిసి తమ సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తామన్నారు. సభ అనంతరం పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీంతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి గోపిచంద్, వైస్ ప్రెసిడెంట్ కేవీ రమేష్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుమూర్తి పాల్గొన్నారు.

నిర్మాత ఉప్పలపాటి మృతికి కళా సంస్థల సంతాపం



సూర్యనారాయణబాబు సంతాప సభలో పాల్గొన్న చిట్టిబాబు, డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం సినీ నిర్మాత ఉప్పలపాటి సూర్యనారాయణబాబు సంతాప సభ నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ సినీ నటుడు కృష్ణతో ఉన్న అనుబంధంతో తెలుగు, హిందీ భాషల్లో విజయవంతమైన చిత్రాలను నిర్మించారని తెలిపారు. ఆయనకు నగరంతో విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. సినీ నటుడు కృష్ణ చిత్రాలకు నిర్మాణ సారథ్యం వహించారన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్ రాజు మాట్లాడుతూ పద్మావతి ఫిలిమ్స్ పేరిట 24 సినిమాలను నిర్మించినట్లు తెలిపారు. సంతాప సభలో వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు గంగిశెట్టి అయ్యప్ప, గంగిశెట్టి రామకృష్ణ, ప్రిన్స్ ఆదిరాల జయప్రభు, మద్దెల శ్యాంబాబు, బోడి ఆంజనేయరాజు కారుమంచి రాజు, బీవీ వీరభద్రరావు, సింగంశెట్టి చంద్రశేఖర్, చావా నరసింహరావు తదితరులు సూర్యనారాయణబాబు చిత్ర పటానికి నివాళులర్పించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో

మధురానగర్(విజయవాడ సెంట్రల్):నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య పురస్కరించుకుని అమ్మవారికి విశేషంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆదివారం అమావాస్య కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శివకామేశ్వరీ అమ్మవారికి శ్రీచక్ర నవార్చన పంచ హారతులు ఇచ్చారు. అలాగే నీలకంఠేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

ఉద్యమాల పాట 'వడ్లమూడి'



వడ్లమూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖ కవి దేవేంద్ర తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కళారంగానికి ప్రాథమిక ఆయుధం పాటని, అటువంటి పాటని ఒకనాటి ఉద్యమ అవసరాలకు ఆయుధంగా మలచిన ప్రజా కవి వడ్లమూడి అని ప్రముఖ కవి కె.దేవేంద్ర పేర్కొన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజాకవి, రచయిత, రైతు నేత, అమరజీవి వడ్లమూడి నాగేశ్వరరావు శతజయంతి ఉత్స వంలో భాగంగా ప్రజానాట్యమండలి, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆట - పాట - మాట కార్యక్రమం జరిగింది.

ఆకట్టుకున్న నృత్య రూపకాలు..

ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ వడ్లమూడి వేలు పట్టుకుని తన పాట ప్రయాణం మొదలైందని సగర్వంగా ప్రకటించారు. కవిగా వడ్లమూడి స్పృశించని అంశం లేదని, గురజాడ దేశభక్తి గీతానికి సరిసమానమైన సందేశం గీతాన్ని వడ్లమూడి రచించారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి దుశ్చర్యలను నిరసిస్తూ మారాజులొచ్చారు(రంగి) నృత్యరూపకాన్ని రచించి రాష్ట్రమంతా ప్రదర్శనలిచ్చారని గుర్తుకు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ప్రజా కళాకారులు వడ్లమూడి రచించిన గీతాలను ఆలపించి ప్రదర్శించిన పలు నృత్య రూపకాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం అవసరం

సామాజిక ఉద్యమకారుడు వైకే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆధిపత్య కులాలు, రాజకీయ పార్టీలను ఎన్నికల్లో బలపరుస్తూ బీసీ సంఘాలు సామాజిక న్యాయానికి, రాజ్యాధికారానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని న్యాయవాది వైకే అన్నారు. ఈ నేపథ్యంలో స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వైకే మాట్లాడుతూ స్వతంత్ర బీసీ ఉద్యమ ఆవశ్యకతను వివరించారు. స్వతంత్ర బీసీ ఉద్యమం లేకుండా బీసీలకు ఎప్పటికీ రాజ్యాధికారం దక్కదన్నారు. ఇకనైనా అన్ని బీసీ సంఘాలు స్వతంత్ర ఉద్యమ నిర్మాణం వైపుగా సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు 21 మందితో ఆర్గనైజేషన్ కమిటీ ఎన్నుకున్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీసీ ప్రతినిధులు పీవీ రమణయ్య, వీరవల్లి శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, పితా రమేష్, పెండ్యాల నారాయణ, భాస్కర్ గౌడ్,సూరిబాబు, బొబ్బిలి సూర్యనారాయణ, సి.శంకర్, రేణుకా దేవి, శిరీష, సీహెచ్ పద్మ, కడియం సూరిబాబు పాల్గొన్నారు.

ముస్లింలు ఐకమత్యంగా ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ముస్లింలు ఐక్యంగా ఉండాలని తోటివారికి సాయం చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు చర్చించి న్యూ ఆర్ఆర్ పేట చెందిన ఎండీ నజీరుద్దీన్‌ను 57వ డివిజన్ ఆజాద్ ముస్లిం కమిటీ ఉపాధ్యక్షుడిగా, ప్రకాష్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ యూసఫ్‌ను 62వ డివిజన్ యూత్ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, విజయవాడ నగర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ, 59 వ డివిజన్ ఇన్‌చార్జ్ ఎండీ అతావుల్లా, సెంట్రల్ యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ జానీ భాష, సెంట్రల్ సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, సెంట్రల్ నియోజకవర్గ యూత్ కార్యదర్శి గాలిబ్ బేగ్, 57వ డివిజన్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ , 57 వ డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ మీరావలి, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ, కమిటీ యూత్ నాయకులు మన్సూర్, జావీద్ తదితర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులు సత్వరమే పూర్తి చేయండి



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులు సత్వరమే పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పటమట, కృష్ణలంకలోని అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అనంతరం ఆయన పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం సందర్శించి స్టేడియంలో వీఎంసీ కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. స్టేడియం జరుగుతున్న మరమ్మతులను త్వరగా పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల బయట గ్రీనరీ పెంచాలని, పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో సర్కిల్-3 జోనల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50వేల విరాళం



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి నిత్యాన్నదానంకు విరాళం అందజేస్తున్న ఇంద్రకీల గిరీష్

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ ముప్పా ఇంద్రకీల గిరీష్ రూ. 50 వేలు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము మందిరంలో తలపెట్టిన ప్రతి కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. షిరిడీలో మాదిరిగా ఇక్కడ అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. షిరిడీకి వెళ్లి మొక్కులు తీర్చుకోలేని వారు ఇక్కడ మొక్కులు తీర్చుకుంటున్నారని తెలిపారు. దాత డాక్టర్ ముప్పా ఇంద్రకీల గిరీష్ మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో తాను కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో విరాళం అంజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాతను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిరం కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

క్షత్రియ సేవా సంఘం సేవలు నిరుపమానం



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ రామ్మోహన్‌రావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):నిరుపేద వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, పింఛన్లు అందజేస్తున్న క్షత్రియ సేవా సంఘం సేవలు నిరుపమానం అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అయోధ్యనగర్ క్షత్రియ భవన్‌లో ఆదివారం క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యాన వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం, పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా సేవలు నిర్వహిస్తున్న క్షత్రియ సేవా సంఘాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు మాట్లాడుతూ తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని కోరారు. క్షత్రియ సేవా సంఘ కమిటీ అధ్యక్షుడు సాగి నరసింహరాజు, కార్యదర్శి ఉద్ధరాజు విజయ రామరాజు, కోశాధికారి డీజేవీఎస్ రాజు, ఉపాధ్యక్షుడు రామలింగరాజు, నారాయణరాజు, కె.ప్రసాదరాజు, గొట్టుముక్కల వెంకీ, క్షత్రియ యువజన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, మిథిలేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): మంచి పనులకు ఎల్లప్పుడూ ముందుంటానని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. పాయకాపురంలోని స్పందన సేవా సమితి కార్యాలయంలో ఆదివారం స్పందన వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వైకె శాస్త్రి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు పేద విద్యార్థులకు రూ.27 వేల ఆర్థిక సాయం అందించగా, ఎమ్మెల్యే ఉమా మహేశ్వరావు కూడా సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించారు. యోగా మ్యాట్లు అందచేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్పందన వాకర్స్ క్లబ్‌కు వైకె శాస్త్రి యోగా క్లబ్‌గా నామకరణం చేశామని తెలిపారు. పారా మెడికల్ ఆఫీసర్‌గా యోగా క్లబ్ సభ్యులకు శాస్త్రి అందించిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ, టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ మహిళా కన్వీనర్ దాసరి ఉదయశ్రీ,సేవా సమితి ప్రధాన కార్యదర్శి పి.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్తనాళాల వ్యాధులపై అవగాహన అవసరం



రక్తనాళాల సమస్యలను వివరిస్తున్న వాస్క్యులర్ సర్జన్స్ మాకినేని కిరణ్, శివకృష్ణ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మారుతున్న జీవనశైలి కారణంగా రక్తనాళాల వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పలువురు వాస్క్యులర్ సర్జన్స్ అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, యోగా వంటి వాటితో వ్యాధుల బారిన పడకుండా చూడవచ్చునని వారు పేర్కొన్నారు. ఈ నెల 6 జాతీయ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీశాఖ ఆధ్వర్యంలో రక్తనాళాల వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించిన ఈ వాక్‌థాన్‌ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి..

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీలు మాట్లాడుతూ రక్తనాళాల జబ్బులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్సల గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నామన్నారు. మందులు వేసుకుంటే వ్యాధి తగ్గిపోతుందని అందరూ భావిస్తారని, వ్యాధి తగ్గాలంటే మందులతో పాటు మన వైపు కృషి చేయాలన్నారు. వ్యాయామం, ఆహార నియమాలు వంటివి పాటిస్తే కాళ్ల నల్లబడటం, గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే రిస్కీ తగ్గుతుందన్నారు. నూనె, వేపుడు, కొవ్వు పదార్థాలు తగ్గిస్తేనే వ్యాధి రాకుండా నియంత్రించవచ్చునన్నారు. ఉబ్బిన సిరలు రాకుండా ఉండాలంటే వ్యాయామం చేయడం, ఒకే చోట నిలబడకుండా పనిచేయడం, స్థూల కాయం తగ్గించుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

బీవోఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటు పెంపు

జోనల్ మేనేజర్ ముత్తా బంగార్రాజు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా షార్ట్, మీడియం టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు పెంచిందని బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ ముత్తా బంగార్రాజు కోరారు. చుట్టుగుంట బ్యాంక్ ఆఫ్ ఇండియాజోనల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించటమే లక్ష్యంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా పనిచేస్తుందని చెప్పారు. వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై వడ్డీ రేటు పెంచామని పేర్కొన్నారు. 180 రోజుల నుంచి ఏడాదిలోపు కాల వ్యవధి కలిగిన స్వల్ప, మధ్య కాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై వడ్డీ రేటు పెంచినట్లు తెలిపారు. 666 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై 7.30 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.80 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్‌లకు 7.95 శాతం వడ్డీ అందిస్తున్నామని వెల్లడించారు. రూ. 3 కోట్ల లోపు 180 నుంచి 269 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల పైవడ్డీ 5.5 నుంచి 6 శాతంకు పెంచామని వివరించారు. అలాగే రూ. 3కోట్ల నుంచి రూ. 10 కోట్లవరకు ఏడాదిలోపు డిపాజిట్‌లపై 6.25 నుంచి 6.75 కు వడ్డీ రేటు పెంచామని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్‌లకు 0.5శాతం వడ్డీ అధికంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదవకాశంను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ - 1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2, పటమటలోని సర్కిల్ - 3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆయా ప్రాంతాల స్థానికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com